క్లుప్తంగా

కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్టాపన


ప్రతిష్టాపన అనంతరం పూజల్లో పాల్గొన్న భక్తులు

కోసిగి: మండల కేంద్రంలో వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి విగ్రహ ప్రతిష్టాపన శుక్రవారం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ ధర్మకర్త ఇల్లూరి శ్రీనివాస శెట్టి ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. గణపతి పూజ, వివిధ హోమాలు చేశారు. శుక్రవారం వేకువజామున నుంచి వేదమంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం చేపట్టారు. విగ్రహ ప్రాణ ప్రతిష్ట, నేత్రోన్మీలనం, పూర్ణకుంభాభిషేకం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు ఆదినారాయణ శెట్టి, రమేష్ శెట్టి, నాగేష్, కొల్లి రామకృష్ణ, పార్థసారథి, భాస్కర, భరద్వాజ్, రవితేజ, దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చింతలమునిస్వామి దశమి వేడుకలు


పూజలందుకుంటున్న చింతలమునిస్వామి

పెద్దకడబూరు: మండల కేంద్రమైన పెద్దకడబూరులో వెలసిన చింతలముని, నల్లారెడ్డి స్వామి దశమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి జలాభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, ఆకుపూజ తదితర పూజలు నిర్వహించి మహా మంగహారతులు పట్టారు. రాత్రి అన్నదానం అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం వేకువజామున చింతలమునిస్వామి దేవాలయం నుంచి ఎమ్మిగనూరు రహదారిలోని ఓబులేసు స్వామి దేవాలయం వరకు భజనలతో ఊరేగింపుగా వెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తిరిగి దేవస్థానానికి చేరుకుని మహా మంగళహారతులతో కార్యక్రమానికి ముగింపు పలకనున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు పేర్కొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


మాట్లాడుతున్న సీఐ సూర్యమోహన్‌రావు

ఆదోని రూరల్: విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని టూటౌన్ సీఐ సూర్యమోహన్‌రావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆదోని పట్టణ శివారులోని భీమా ఇంజినీరింగ్ కళాశాలలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రోడ్లపై వాహనాలను నడిపేటప్పుడు నిర్దేశిత వేగంతోనే వెళ్లాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. ట్రాఫిక్, రోడ్డు భద్రతా నియమాలను ఇతరులకు తెలియజేయాలన్నారు. నియమాలను పాటిస్తే ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగవని చెప్పారు. ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మన్న, కళాశాల సెక్రటరీ పి.ఎస్.విష్ణువర్ధనరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం


కాలిపోతున్న గుడిసె

కోసిగి: మండల కేంద్రం కోసిగి కడపాళెంలోని 3వ వార్డులో కౌతాళం నాగరాజు, పార్వతి దంపతులకు చెందిన గుడిసె విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో శుక్రవారం మధ్యాహ్నం దగ్ధమైంది. వీరు రోజువారి కూలి పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం గుడిసె పైభాగం వెళ్లిన విద్యుత్ తీగలు నుంచి నిప్పు రవ్వలు పడడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు గుర్తించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేక పూర్తిగా కాలిపోయింది. గుడిసెలో ఉన్న రూ.50 వేల నగదు, 2 తులాల బంగారం, నిత్యావసర సరుకులు, బట్టలు, టీవీ, గుడిసెకు సంబంధించిన పట్టాలు కాలిపోయాయి. సుమారు రూ.4 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఈరన్నస్వామికి గొడుగు వితరణ


గొడుగును అందజేస్తున్న దాత

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయానికి దేవనకొండ మండలం కుంకునూరు గ్రామానికి చెందిన జంగిల్ హనుమంతు, నవనీత్ దంపతులు స్వామివారి పల్లకీ సేవ కోసం గొడుగును విరాళంగా అందజేశారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామిసన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు, స్వామివారి శేష వస్త్రాలు అందజేశారు. ఆలయ అభివృద్ధికి భక్తులు విరివిగా విరాళాలు అందజేసి సహకరించాలని డీసీ కోరారు. ఆలయ ఉప ప్రధాన అర్చకుడు మహదేవస్వామి, ఆలయ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


సిద్ధేశ్వర స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా సిద్ధేశ్వరుడి రథోత్సవం

కౌతాళం: మండలంలోని హాల్వి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామి జాతర శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. సిద్ధేశ్వరస్వామికి మఠాధిపతులు తెల్లవారుజామున ప్రత్యేక పూజలు, సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, విశిష్ట పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. మహోత్సవానికి చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు రథోత్సవం సాగింది.


ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

వెండి పాదుకలు విరాళం



భక్తులు సమర్పించిన వెండిపాదుకలకు పూజలు చేస్తున్న పీఠాధిపతి సయ్యద్ చిన్న ముద్గొల్

గోనెగండ్ల: మండలంలోని గంజిహళ్లి గ్రామంలో వెలసిన మహాత్మ బడేసాహెబ్ తాత స్వామికి గ్రామానికి చెందిన త్రివిక్రం రెడ్డి, తల్లిదండ్రులు ప్రతాప్‌రెడ్డి, అరంజ్యోతి దంపతులు రూ.70 వేలు విలువ చేసే వెండి పాదుకలను అందజేశారు. శుక్రవారం దర్గ ధర్మకర్త కుబేర్‌రెడ్డికు పాదుకలను అందజేశారు. ఈ సందర్భంగా ధర్మకర్త వెండి పాదుకలకు బడేసాహెబ్ స్వామివారి మునిమనవడు పీఠాధిపతి సయ్యద్ చిన్న ముద్గొల్ స్వామిచే ప్రత్యేక పూజలు చేయించారు. పాదుకలను భక్తుల దర్శనార్థం స్వామి వారి జీవసమాధి వద్ద ఉంచారు. దర్గా సొసైటీ సభ్యులు దర్గా బడేసాహెబ్, చిన్న ఖాశీంవలి ఉన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు


వీరంపల్లిలో మిరప పంటను పరిశీలిస్తున్న జపాన్ బృందం సభ్యులు

గోనెగండ్ల: రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ధనూకా జపాన్ బృందం సభ్యులు సాజల్ బిస్వాస్ సాన్, పుజిత సాన్ అన్నారు. శుక్రవారం మండలంలోని వీరంపల్లి గ్రామంలో.. మిరపలో బూడిద తెగులు నివారణకు రైతులు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మిరప, ఉల్లి తదితర పంటలలో బూడిద తెగులు అధికంగా వస్తుందని, ఈ తెగులు లావెల్లులా టౌరికా అనే ఫంగస్ వల్ల వస్తుందన్నారు. ఈ తెగులు సోకిన వెంటనే ఆకు దిగువ భాగంలో చిన్న తెల్లటి మచ్చలు కనిపిస్తాయని, ఫంగస్ పెరుగుదలను బట్టి ఆకు పైభాగంలో లేత పసుపు రంగు మచ్చలు వ్యాపిస్తాయని తెలిపారు. తెగులు నివారణకు కాను నిస్సోడియం అనే మందును వాడాలని సూచించారు. అలాగే పలు రకాల పంటలలో రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను, పంట సాగుకు ముందు వాలుకు అడ్డుగా దున్నడం వల్ల కలిగే ఫలితాలను వివరించారు. అనంతరం మిరప తదితర పంటలను పరిశీలించారు. జనరల్ మేనేజర్ హుస్సేన్‌వలి, డీజీఎం పరశురామయ్య, లోకేశ్వర రెడ్డి, మోహన్ రెడ్డి, కర్నూలు టీమ్ సభ్యులు, వీరంపల్లి, తిప్పనూరు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు


నాగలదిన్నె వద్ద తుంగభద్ర నదిలో ఇసుకను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

నందవరం: ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు. మండలంలోని నాగలదిన్నె గ్రామంలో శుక్రవారం తుంగభద్ర నదిలోని ఇసుకను తహసీల్దార్ పరిశీలించారు. నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ముగతి గ్రామానికి చెందిన ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రావాణాకు పాల్పడితే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ప్రభుత్వ అనుమతులతో నియమ నిబంధనల మేరకే ఇసుకను తరలించాలన్నారు. నాగలదిన్నెలో ఇసుక రీచ్ లేదని, ప్రభుత్వం ఇసుక రీచ్‌కు ఎలాంటి అనుతులు ఇవ్వలేదని చెప్పారు. ఇన్‌చార్జ్ ఆర్ఐ సుబ్బారెడ్డి, గ్రామ రెవెన్యూ సహాయకులు ఉన్నారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య వాగ్వాదం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మధ్య శుక్రవారం వాగ్వాదం చోటు చేసుకుంది. ఉదయం ప్రార్థన సమయంలో కొంతమంది విద్యార్థినులు వాగ్వాదం చేసుకుంటున్నారు. గమనించిన ఓ ఉపాధ్యాయురాలు వారిని మందలించింది. అయిన వారు మాట వినకుండా రెచ్చిపోయి దూషణలకు దిగడంతో ఉపాధ్యాయురాలు వారిని కొట్టింది. ఈ విషయంపై ఓ విద్యార్థిని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయురాలితో వాగ్వాదానికి దిగారు. సదరు ఉపాధ్యాయురాలు సర్దిచెప్పినా వినకుండా పిల్లలను ఎలా కొడతారని ప్రశ్నించారు. ఘటనపై టీడీపీ మహిళా నాయకురాలు పోలీసులకు సమాచారం అందించడంతో టూటౌన్ ఎస్ఐ రామ్‌నాథ్ సిబ్బందితో పాఠశాలకు వెళ్లి సమస్యపై ఇరువురితో మాట్లాడి వివాదం పరిష్కరించారు.

కూటమిలో కుమ్ములాట

- జనసేన నేత సీసీ రోడ్డు వేస్తుండటంతో అడ్డుకున్న టీడీపీ శ్రేణులు
- పెద్దతుంబళంలో ఘటన


వాగ్వాదం చేసుకుంటున్న జనసేన, టీడీపీ నాయకులు

ఆదోని రూరల్: కూటమిలో కుమ్ములాటలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆ పార్టీల్లోని నాయకులకు ఒకరంటే ఒకరికి గిట్టడం లేదు. ఎవరికి వారు ఆధిపత్యం చెలాయిస్తూ సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాలువల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు తమకే కావాలని బాహాటంగా తలపడుతున్నారు.

ఇదిలాఉండగా మండలంలోని పెద్దతుంబళం గ్రామం బీసీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ సమస్యను పరిష్కరించేందుకు ఇటీవల ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.2 లక్షలు మంజూరు చేసింది. ఈ పనులను శుక్రవారం జనసేన పార్టీకి చెందిన ఖాదర్‌బాషా ప్రారంభించగా విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ కార్యకర్తలుగా ఉన్న తమకే పనులు గానీ, పదవులు గానీ కేటాయించలేదు. మీకెలా పనులు ఇచ్చారని ప్రశ్నిస్తూ, రోడ్డు పనులు చేయనివ్వబోమని అడ్డుకున్నారు. కూటమిలో తమకు పనులు కేటాయించిన తర్వాతే మిగతా పార్టీల గురించి ఆలోచిస్తామని అప్పటివరకు ఎలాంటి అభివృద్ధి పనులైనా జరగకుండా అడ్డుకుంటామని ఘంటాపథంగా చెప్పారు.

వలసవాదులపై అమెరికా తీరు ఆక్షేపణీయం

ఎమ్మిగనూరుటౌన్: భారత్ నుండి అమెరికాకు ఉపాధి నిమిత్తం వెళ్లిన వలసవాదులను అక్కడి నుంచి తిరిగి వెనక్కి పంపిన తీరు దేశానికే అవమానకరంగా, ఆక్షేపణీయంగా ఉందని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, జిల్లా నాయకుడు చిన్నా అన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. భారత్ నుంచి వలస వెళ్లిన వారిని బందీలుగా చేసి సంకెళ్లు వేసి వారిని యుద్ధ విమానంలో అమెరికా నుంచి స్వదేశానికి తిప్పి పంపడం శోచనీయమన్నారు. భారత్‌ను అమెరికా మిత్ర దేశంగా పేర్కొంటూనే భారత ప్రజల పట్ల చిన్నచూపు చూడటం తగదన్నారు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ చొరవ తీసుకొని ముున్ముందు ఇలాంటివి చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

విద్యార్థులతో మట్టి పని


పిల్లలతో పనిచేయిస్తున్న టాపర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో టాపర్ కోచింగ్ సెంటర్‌లో పిల్లలకు విద్యాబుద్ధులు బాగా నేర్పుతారని తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పిస్తే నిర్వాహకులు మాత్రం పిల్లలతో మట్టి మోయిస్తూ పనులు చేయిస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకుడు మారుతి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక టాపర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు విద్యార్థులకు చదువులు చెప్పకుండా ఎండలో వారితో రోడ్డు పక్కన మట్టి వేయిస్తూ ఇబ్బందులు పెట్టారని వివరించారు. దీనిపై ప్రశ్నిస్తే విద్యార్థుల కోసమేనంటూ నిర్లక్ష్యపు సమాధానం ఇస్తున్నారని వారిపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ కోతలు

ఆదోని అర్బన్: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు చేపట్టనున్న కారణంగా ఆదోని నియోజకవర్గంలోని గ్రామీణ, పట్టణాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ పురుషోత్తం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోతలు ఉంటాయన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు స్వర సంగమం

ఆదోని అర్బన్: మధుర గాయకుడు పద్మశ్రీ ఘంటసాల 51వ వర్ధంతి సందర్భంగా శృతిలయ సంగీత కళాసేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్వర సంగమం సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకుడు రాడికల్ మల్లికార్జున శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక శ్రీ మంగళ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సంగీత విభావరి కార్యక్రమంలో సంగీత కళాకారులు ఘంటసాల మధురమైన గేయాలు పాడుతారని తెలియజేశారు. ఘంటసాల అభిమానులు, సంగీత అభిమానులు, కళాకారులు పాల్గొనాలని కోరారు.

అర్హులందరికీ రుణాలు ఇవ్వాలి

ఆదోని సెంట్రల్: బీసీ, ఓబీసీ కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేసే రుణాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు శుక్రవారం డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ.. రుణాల కోసం ఎంతోమంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని, రాజకీయ జోక్యం లేకుండా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలన్నారు. రుణాలు మంజూరైతే తద్వారా వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించవచ్చనే ఆలోచనలో నిరుద్యోగులు ఉన్నారని చెప్పారు. నిరుద్యోగ సమస్యను అధిగమించాలంటే ఉపాధి అవకాశాలను మెరుగు పరచాలన్నారు. అధికారులు, పాలకులు ఇంటర్వ్యూలను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు.

పేదలకు అన్నదానం

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, బుట్టా శివనీలకంఠ దంపతుల 37వ వివాహ వార్షికోత్సవం పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పేదలకు అన్నదానం చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంకే శివప్రసాద్‌లు పేదలకు అన్నం ప్యాకెట్లను పంపిణీ చేశారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొలువుదీరిన టౌన్‌బ్యాంక్ పాలకవర్గం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని టౌన్‌బ్యాంక్ నూతన పాలకవర్గం శుక్రవారం కొలువుదీరింది. బ్యాంకు ఆవరణలో జరిగిన పాలక వర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి పాల్గొనగా బ్యాంక్ చైర్మన్‌గా ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి, వైస్ చైర్మన్‌గా బండా నర్సప్ప, డైరెక్టర్లుగా మహబుబ్‌బాషా, రవికుమార్, వాల్మీకిరాజు, వెంకటేశ్వర్‌రెడ్డి, నవీన్‌కుమార్, షాలెం, వెంకటగిరి, దోమభీమేష్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం పాలకవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. వ్యాపారులు, చిరువ్యాపారులు, చేనేత కార్మికులకు రుణాలు ఇచ్చి, ఖాతాదారులకు మెరుగైన సేవలందించి పాలకవర్గం బ్యాంకు అభ్యున్నతికి పాటుపడాలని సూచించారు. బ్యాంకు సిబ్బంది, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పిల్లలను ఉన్నత చదువులు చదివించాలి

ఆదోని రూరల్: కార్మికులు వారి పిల్లలను బాగా చదివించి ప్రయోజకుల్ని చేయాలని ఆదోని ఫస్ట్ అడిషనల్ జడ్జి ఎం.ఎల్.సాయి సుభాష్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆదోని మార్కెట్ యార్డులో 'న్యాయ విజ్ఞాన సదస్సు' నిర్వహించారు. హాజరైన జడ్జి ఎం.ఎల్.సాయి సుభాష్ మాట్లాడుతూ.. పిల్లలను బాగా చదివిస్తే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్మికులుగా మార్చవద్దని, చదువుతోనే అన్నీ సాధ్యమవుతాయని వివరించారు. అలాగే కార్మికులకు చట్టాల గురించి, ఉచిత న్యాయ సహాయం గురించి అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు. తహసీల్దార్ శివరాముడు, న్యాయవాదులు శ్రీధర్, మార్కెట్ యార్డు అధికారులు, సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ హాస్టల్ తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: సీజనల్ హాస్టల్‌లో మెరుగైన సదుపాయాలు కల్పించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో సీజనల్ హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని ప్రతి గదిని తనిఖీ చేసి విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వసతుల గురించి సబ్‌కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థుల హాజరు పట్టిక ప్రకారం అందరూ వసతి గృహంలో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో సబ్‌కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు.

12న లక్ష బిల్వార్చన


శివమాలధారులకు ఆధ్యాత్మిక విషయాలను ప్రసంగిస్తున్న గురుస్వామి

ఆదోని అర్బన్: మహాశివరాత్రి పండగను పురస్కరించుకుని స్థానిక శంభులింగేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 12వ తేదీన లక్ష బిల్వార్చన పూజలు ఉంటాయని గురుస్వామి శైలేంద్రనాథ్ తెలిపారు. ఆయన శుక్రవారం ఆలయంలో ఆధ్యాత్మిక విషయాలపై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 16న శివయ్య జాతర ఉంటుందని, శంభులింగేశ్వర ఆలయం నుంచి ప్రధాన రహదారుల గుండా పురవీధుల్లో శివయ్య విగ్రహంతో ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. సత్యంలో శివుడు, ధర్మంలో విష్ణువు ఉంటారని, సత్యం, ధర్మాన్ని ఆచరిస్తే ఆ దేవుళ్లను స్మరించినంత పుణ్యం కలుగుతుందన్నారు. ప్రతిరోజూ ఓం నమఃశివాయ నామాన్ని స్మరించాలని భక్తులకు సూచించారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే


ఫేర్‌వెల్ డే కార్యక్రమంలో నృత్యం చేస్తున్న విద్యార్థి

ఆదోని సెంట్రల్: ప్రతి విద్యార్థి సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సూచించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ సంజన్న అధ్యక్షతన ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. విద్యార్థినులు చదువును నిర్లక్ష్యం చేయకుండా బాగా చదువుకోవాలన్నారు. చదువే మనకు సమాజంలో గౌరవం కల్పిస్తుందన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పరీక్షలు సమీపంలో ఉన్నాయి గనుక ప్రతి ఒక్కరు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఒకరినొకరు ఆటోగ్రాఫ్‌లు తీసుకొని సంతోషంగా గడిపారు. అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టోత్సవాలు


ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న దృశ్యం

గోనెగండ్ల: మండల పరిధిలోని ఐరన్ బండ గ్రామంలో నూతనంగా నిర్మించిన సుంకులా పరమేశ్వరి దేవి ఆలయం, మారెమ్మవ్వ, లింగమయ్య స్వామి గోపుర కలశం, ధ్వజస్తంభం, బొడ్రాయి, వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ముందుగా అర్చకులు యాగపూజలు నిర్వహించారు. గంగామాత కలశం, గోపుర కలశంను గ్రామ పురవీధుల గుండా ఊరేగించి ప్రత్యేక పూజలు చేశారు. గణేశ, నవగ్రహ కలశపూజ, అష్ట దిక్కుల కలశపూజ, శిలా విగ్రహాల జలాధివాసం, ధాన్యదివాసం, హోమం నక్షత్ర కలశ పూజ, యంత్ర ప్రతిష్ట చేశారు. గ్రామం నుంచే గాక చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం, సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు.

ఫార్మర్ రిజిస్ట్రీతో గుర్తింపు నంబర్


వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఏఓ వరప్రసాద్

పెద్దకడబూరు: ఆధార్ తరహాలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ నంబర్ ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతుసేవా కేంద్రం సిబ్బందికి అగ్రీ స్టాక్ ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్ రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయింపు గురించి శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రైతుల వివరాలను నమోదు చేసి రైతులకు డిజిటల్ ఫార్మర్ ఐడీని ఇవ్వడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో రైతుల గుర్తింపు కోసం ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. రైతులు డిజిటల్ ఫార్మర్ ఐడీ కోసం రైతుసేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. 21 అంకెల ఈ గుర్తింపు నంబర్ ద్వారా వ్యవసాయ, అనుబంధ శాఖలు అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేస్తారన్నారు. పీఎం కిసాన్ లబ్ధిదారులను ఈ నంబర్ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. వాతావరణ మార్పులు, వ్యవసాయ పథకాలు నేరుగా రైతులకు చేరవేయడానికి, పంట నష్టం, ప్రకృతి వైపరీత్యాలు, బీమా పరిహారం, మంజూరు తదితర వ్యవసాయ వివరాలను చేరవేయడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ తప్పక చేసుకోవాలని కోరారు. నమోదు చేసుకోవడానికి ఆధార్ కార్డు, పొలం పాస్‌బుక్ లేదా 1 బి, ఆధార్‌తో లింక్ ఉన్న సెల్ నంబర్, రేషన్ కార్డుతో స్థానిక రైతుసేవా కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు.